సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



సోమశిలలో 52.598 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం 52.598 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 6,200 క్యూసెక్కుల వరద వస్తుండగా, 96.744 మీటర్ల నీటిమట్టం నమోదయింది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.77,970
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.7,085
3శాతం జీఎస్టీతో	రూ.7,297
నవర (8గ్రా)	రూ.58,376

గరిష్టం/కనిష్టం
38.0 /28.5

వాతావరణం

జిల్లాలో గాలిలో తేమ 50 శాతంగా గురువారం నమోదైంది. శుక్రవారం వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా టెట్

- తొలి రోజు 3 సెంటర్లలో పరీక్ష



నెల్లూరు పొట్టేపాళెం అయాన్ డిజిటల్ జోన్‌లో టెట్ పరీక్షకు హాజరైన అభ్యర్థులు

నెల్లూరు (టౌన్): టీచర్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) తొలిరోజు పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. కావలిలోని పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల, ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, పొట్టేపాళెంలోని అయాన్ డిజిటల్ సెంటర్లలో పరీక్ష జరిగింది. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. ఉదయం జరిగిన పరీక్షకు మొత్తం 81 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 52 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 75 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు అయాన్ డిజిటల్ సెంటరులో జరుగుతున్న పరీక్షను తనిఖీ చేశారు. అభ్యర్థులను అన్నీ పరిశీలించిన తరువాతే కేంద్రాలలోకి అనుమతించారు.

రేపటి నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్



విలేకర్లతో మాట్లాడుతున్న మేకల వెంకయ్య

నెల్లూరు(బారకాసు): నగరంలోని వీఆర్సీ క్రీడా మైదానంలో మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్-3 శనివారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని ఆ సమితి జిల్లా కార్యదర్శి మేకల వెంకయ్య తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడారు. ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌కు ముఖ్య అతిథులుగా కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొంటారన్నారు. ఈ మేళా ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు.

పరిశోధనలపై దృష్టిపెట్టండి

వెంకటాచలం: విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులు దేశాభివృద్ధికి ఉపయోగపడే పరిశోధనలపై దృష్టి సారించాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు సూచించారు. కాకుటూరు వద్ద నున్న వీఎస్‌యూలో గురువారం వికసిత్ భారత్-2047 కార్యక్రమంలో భాగంగా వన్ డే ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ ఆన్ ఇన్నోవేషన్ అండ్ స్టార్ట్ అప్ ఐడియాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.విజయ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

అడిగినంత ఇస్తే.. ఓకే

లేకపోతే పోలీసు కేసులే

- ఇసుక కోసం ప్రజల నానా తంటాలు
- ముడుపుల్లోనూ పోలీసుల మధ్య విభేదాలు
- సీఐని నిలదీసిన ఎస్సై
- కూటమి ప్రభుత్వంలో సామాన్యులకు అడుగడుగునా ఇక్కట్లు



వింజమూరు(ఉదయగిరి):

➡ కొండాపురం మండలం లింగానపాళేనికి చెందిన ఓ వ్యక్తికి తన ఇంటి అవసరాల నిమిత్తం ఇసుక అవసరమైంది. ఈ విషయమై కొండాపురం పోలీసులతో మాట్లాడుకొని కొంత మొత్తం ముట్టచెప్పి మూడు రోజుల క్రితం రెండు ట్రాక్టర్లు, ఓ జేసీబీ ద్వారా ఇసుక తరలిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కలిగిరి సర్కిల్ కార్యాలయానికి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు లింగానపాళెం వాగు వద్దకు వెళ్లి అక్రమంగా తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను ఆపుచేసి బేరం మొదలు పెట్టారు. రూ.లక్ష ఇస్తే వదిలివేస్తామని కానిస్టేబుల్స్ డిమాండ్ చేశారు. కానీ ఆ వ్యక్తి ఇచ్చేందుకు నిరాకరించడంతో జేసీబీ వదిలివేసి ట్రాక్టర్లను కొండాపురం పోలీస్ స్టేషన్ తీసుకొచ్చారు. తన పరిధిలో తనకు తెలియకుండా అక్రమ ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తేవడంపై ఎస్సై మహేంద్రకు కోపం వచ్చింది. కలిగిరి సీఐకు ఫోన్ చేసి నా ఏరియాలో మీ జోక్యం ఏమిటి అంటూ గట్టిగా నిలదీసినట్లు ప్రచారం సాగుతోంది. కలిగిరి సర్కిల్ పరిధిలో ఎవరు ఇసుక తరలించాలన్నా, స్థానిక పోలీస్ స్టేషన్‌తో పాటు సర్కిల్ కార్యాలయానికి మామూళ్లు ఇవ్వాల్సిందేనని సదరు సీఐ తేల్చి చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.

➡ మూడు రోజుల క్రితం కొండాపురం మండలం చల్లగిరిగల సమీపంలో పిల్లాపేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని వారి వద్ద నుంచి కొంత నగదు తీసుకొని వదిలి వేశారు. ఈ విషయమై కూడా సర్కిల్ పోలీసులకు, స్థానిక స్టేషన్ పోలీసులకు మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. అక్రమ రవాణాను అరికట్టాల్సిన పోలీసులే వసూళ్లకు పోటీ పడుతుండటం చర్చనీయాంశంగా మారింది.

కలిగిరి పోలీస్ సర్కిల్ పరిధిలో ఉన్న మండలాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కంచే చేను మేసిన చందంగా... అక్రమ రవాణాను అరికట్టాల్సిన పోలీసు అధికారులు మామూళ్లు పుచ్చుకొని వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వింజమూరు, కొండాపురం మండలాల్లో స్థానికంగా ఉన్న వాగుల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. వీరు నిత్యం పామూరు, వింజమూరు, కొండాపురం, కలిగిరి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ముందుగా పోలీసులతో మాట్లాడుకొని డబ్బులు ఇస్తే ఆ ట్రాక్టర్లు రాత్రి పగలు ఎప్పుడైనా అక్రమ రవాణా చేసుకోవచ్చు. అలా కాకుండా ఎవరైనా ఇసుక తోలితే అక్కడకు పోలీసులు వెంటనే వాలిపోతున్నారు. అడిగినంత ఇస్తే ఓకే లేకపోతే కేసులు నమోదు చేసి ఇబ్బంది పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే సామాన్యులకు ఇసుక బ్రహ్మ పదార్థంగా మారింది. తమ చెంతనే ఇసుక ఉన్నా, గంపెడు తెచ్చుకోలేని పరిస్థితి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి పోలీసు అధికారి పూర్తి స్థాయిలో దృష్టి పెట్టి ఇసుక అక్రమ రవాణాను అరికట్టి అందరికీ అందుబాటులో ఇసుక ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చాకలకొండ - వింజమూరు మార్గంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్



చల్లగిరిగల వద్ద పిల్లాపేరులో ఇసుక ట్రాక్టర్ల వద్ద సివిల్ డ్రస్‌లో కానిస్టేబుల్



కొండాపురం మండల లింగానపాళెం వద్ద ట్రాక్టర్లను సీజ్ చేసిన సర్కిల్ పోలీసులు



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

బ్లడ్‌బ్యాంకుకి జాతీయ స్థాయి గుర్తింపు

- ఎమ్మెల్సీ, రెడ్‌క్రాస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి
- రక్తదాన మోటివేటర్స్‌కి అవార్డులు అందజేత

నెల్లూరు(అర్బన్): విస్తృతమైన సేవల ద్వారా నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకుకి జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు లభించిందని ఆ సొసైటీ జిల్లా చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రక్తదాన మోటివేటర్లకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రెడ్‌క్రాస్ ద్వారా 14 సేవా ప్రాజెక్టులు నిర్వహిస్తున్నామన్నారు. ఇంకా రక్తం కొరత ఉన్నందున యువత ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేసి బాధితుల ప్రాణాలు కాపాడాలని కోరారు. తలసేమియా రోగులకు ఉచితంగా ప్రతి నెలా రక్తం అందిస్తున్నామన్నారు. రోగులకు, క్షతగాత్రులకు స్వచ్ఛంద రక్తదానం చేయించడంలో మోటివేటర్ల పాత్ర ఎంతో గొప్పగా ఉందన్నారు. ఎక్కువగా రక్తదానం చేయించిన 138 మందికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ సుధీర్ నాయుడు, రాష్ట్ర ఎంసీ సభ్యుడు రవిప్రకాష్, జిల్లా ఎంసీ మెంబర్లు మలిరెడ్డి కోటారెడ్డి, రాజేంద్రప్రసాద్, శ్రీహరిరెడ్డి, ప్రసన్నాంజనేయులు, స్పాస్టిక్ సెంటర్ కోకన్వీనర్ బలరామయ్య నాయుడు, జీవితకాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మా పరిస్థితి ఏంటి బాబూ?

- చిరుద్యోగుల పొట్టకొట్టేలా వ్యవహరించొద్దు
- ఉద్యోగ భద్రత కల్పించాలి
- ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ఆవేదన



ఆత్మకూరులో మద్యం దుకాణం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న చిరుద్యోగులు

ఆత్మకూరు: మేము అధికారంలోకి వస్తే లక్షలాది ఉద్యోగాలు సృష్టించి ఇస్తామని, తమ ప్రభుత్వం నిరుద్యోగులకు స్వర్గధామంలా ఉద్యోగ కల్పనలను చేస్తామని ఊదరగొట్టి నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 'షరా మామూలే' అన్న చందాన చిరుద్యోగుల పొట్టకొట్టేలా వ్యవహరిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు నియంత్రించి వేలాది మంది యువకులకు దుకాణాల్లో ఉపాధి కల్పించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 17,280 మంది విధులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం దుకాణాలను ప్రైవేట్ పరం చేసేందుకు నూతన మద్యం పాలసీ ప్రకటించింది. ఆ మేరకు ఈ నెల 9వ తేదీలోపు నూతన మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని అబ్కారీ శాఖ పేర్కొంది.

పాపం చిరుద్యోగులు

అయితే దుకాణాల్లో పనిచేస్తున్న చిరుద్యోగుల గురించి జీఓలో ప్రస్తావించక పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో మద్యం దుకాణంలో ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్లు, ఒకరు లేదా ఇద్దరు వాచ్‌మెన్లు ఉండేలా గత ప్రభుత్వం నిర్ణయించి 2019 అక్టోబరు 1 నుంచి ఈ విధానంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. టీడీపీ ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు మద్యం దుకాణాలు కట్టబెట్టనుండడంతో చిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంలా తయారైంది. జిల్లాలో 176 మద్యం దుకాణాలు ఉండగా 560 మంది ఆ దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ నిర్ణయం మేరకు మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగుల కాంట్రాక్ట్ సెప్టెంబరు 30వ తేదీతో ముగిసింది. కొత్త పాలసీ మేరకు మద్యం దుకాణాలు ఏర్పడే వరకు విధులు నిర్వహించాలని ప్రభుత్వ అధికారులు వారికి నోటిమాటగా చెప్పారు. అయితే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏదో ఒక ప్రభుత్వ సంస్థల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు లభించేలా ఆప్కాస్ (ఏపీసీఓఎస్)లో తమ పేర్లు రిజిస్టర్ చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాల్లో పనిచేసే చిరుద్యోగులు కోరుతున్నారు. దీంతో తమకు జాబ్ లభిస్తుందన్న భరోసా ఉంటుందని అంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం నిర్ణయించక పోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో మద్యం దుకాణాలు	వాటిలో పనిచేసిన సిబ్బంది
176	560

మద్యం దుకాణాల మూత

ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత గురించి హామీ ఇవ్వకపోవడంతో మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం దుకాణాలను తెరవకుండా వాటి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాటు ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం చేకూర్చడంతో పాటు మరే ఇతర ఉద్యోగాలకు వెళ్లక దీనినే నమ్ముకొని విధులు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు మమ్మల్ని తొలగించే ప్రయత్నం చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ నాయకులు తమ పరిస్థితిని అర్థం చేసుకొని అవుట్ సోర్సింగ్ విధానంలో ఇతర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

మా కుటుంబాలు వీధిన పడతాయి



గత ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణంలో విధులు నిర్వహిస్తున్నాం. కరోనా సమయంలోనూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేశాం. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మా పొట్టకొట్టేలా వ్యవహరించకుండా ఉద్యోగ భద్రత కల్పించడమో, ఆప్కాస్‌లో రిజిస్టర్ చేసుకొని ఇతర సంస్థల్లో ఉద్యోగాలు ఇవ్వడమో చేయాలి. లేకుంటే మా కుటుంబాలు వీధినపడతాయి.

– పి వెంకటరెడ్డి, మద్యం దుకాణం ఉద్యోగి, ఆత్మకూరు

మేము ఎలా బతకాలి..?



మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న మమ్మల్ని నూతన పాలసీ అంటూ మార్పులు తెచ్చి ఉద్యోగాల నుంచి తొలగించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రస్తుతం అనాథ రైజ్‌గా విధులు నిర్వహించాలని అధికారులు ఫోన్‌లో తెలిపారు. మా కాంట్రాక్ట్ ముగిసిందని తిరిగి కొనసాగించేలా మాకు జీఓ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం. ఇలా మమ్మల్ని తీసేస్తే కుటుంబాలు బతికేది ఎలా. మా పరిస్థితి ఏమిటి.

– జీవీ సుబ్బారెడ్డి, మద్యం దుకాణం ఉద్యోగి, ఆత్మకూరు

సెస్ వసూళ్లలో చేతివాటం

సర్వేపల్లి మార్కెటింగ్ శాఖలో అక్రమాలు!

- రసీదులలో పొంతనలేని లెక్కలు
- రూ.కోట్లు స్వాహా చేశారంటూ ఆరోపణలు
- కలెక్టర్‌కు అందిన ఫిర్యాదులు
- విచారణకు ఆదేశించిన వైనం

సర్వేపల్లి మార్కెటింగ్ శాఖలో అక్రమాలు జరుగుతున్నాయంటూ కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. పెద్దఎత్తున నిధులు స్వాహా చేశారని ఇప్పటికే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఫిర్యాదులపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. సెస్ వసూలులో అవకతవకలు వాస్తవమేనని కొన్ని నిధులు పక్కదారి పట్టాయని మార్కెటింగ్ శాఖ అధికారులు కూడా అంగీకరించారని తెలుస్తోంది.



పొదలకూరు యార్డులోని మార్కెటింగ్ శాఖ కార్యాలయం

పొదలకూరు: నియోజకవర్గంలోని ఐదు మండలాలు సర్వేపల్లి మార్కెటింగ్ శాఖ పరిధిలోకి వస్తాయి. వెంకటాచలంలో కూడా ఆ శాఖ చెక్‌పోస్టు ఉంది. పొదలకూరు ప్రభుత్వ మార్కెట్ యార్డులోనే సర్వేపల్లి మార్కెటింగ్ శాఖకు చెందిన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నిమ్మ యార్డు ఆ శాఖకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. చెక్‌పోస్టుల నుంచి ధాన్యం, జామాయిల్, సవక కర్ర తరలింపు సమయంలో కూడా కొంతవరకు ఆదాయం సమకూరుతుంది. కార్యాలయం పరిధిలో 10 మంది సిబ్బంది ఉన్నారు. బయటి మండలాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో ఇక్కడి నుంచే వారు విధులకు వెళ్తుంటారు.


ఇష్టానుసారంగా..

పొదలకూరు మార్కెట్లో సీజన్‌లో నిత్యం సుమారు 15 నుంచి 20 లారీల్లో దేశంలోని నలుమూలలకు నిమ్మకాయలను తరలిస్తుంటారు. సరుకు విలువను బట్టి మార్కెటింగ్ శాఖ ఒక శాతం సెస్ వసూలు చేయాల్సి ఉంటుంది. అయితే కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై సిబ్బందిలో విభేదాలు ఏర్పడి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. రూ.కోట్లు దుర్వినియోగం అవుతున్నట్టు అందులో పేర్కొన్నారు. సాధారణంగా సెస్ వసూలు సందర్భంగా ప్రతి లారీ నుంచి మార్కెటింగ్ శాఖ నుంచి సిబ్బంది నగదు వసూలు చేస్తారు. ఆ సమయంలో మూడు రసీదులను పుస్తకంలో రాయాల్సి ఉంటుంది. ఒకటి లారీ డ్రైవర్‌కు, రెండోది కార్యాలయానికి, మూడోది పుస్తకంలో వెరిఫికేషన్‌కు ఉంచుతారు. అయితే డ్రైవర్‌కు అందజేసే రసీదులో ఒక అమౌంట్ రాస్తున్నారు. మిగిలిన రెండింటిలో తక్కువ అమౌంట్ రాసి నగదు స్వాహా చేస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొన్నేళ్లుగా ఈ దోపిడీ జరుగుతున్నట్టు అందులో పేర్కొనడం విశేషం. ఇప్పటి వరకు రూ.4 కోట్లు నిధులు స్వాహా చేశారని కలెక్టర్‌కు అందిన ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం.

కారణం ఏంటి?

సిబ్బంది మధ్య ఆధిపత్య పోరు వల్లే ఆ శాఖలో జరుగుతున్న అవినీతి వెలుగులోకి వచ్చిందన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం మార్కెటింగ్ శాఖ సెక్రటరీ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న నవీన్ అనే వ్యక్తి డిప్యుటేషన్ రద్దు కావడంతో మదనపల్లి మార్కెట్ యార్డుకు తిరిగెళ్లాడు. ఈ పోస్టు కోసం కూడా కొందరు పోటీ పడుతున్నారు. చెక్‌పోస్టుతో సంబంధం లేకుండా నిమ్మ మార్కెట్ యార్డు వద్దే ధాన్యం, కట్టె లారీలను నిలిపి సెస్ వసూలు చేస్తున్నారు. వీటికి ఊడా సరైన లెక్కలు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లారీలో సరుకు విలువను బట్టి సెస్ తీసుకోవాల్సి ఉండగా ఇష్టానుసారంగా తీసుకుంటున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వాదాయానికి గండి పడుతున్నట్టు విమర్శలున్నాయి. చెక్‌పోస్టుల వద్ద కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

అవకతవకలు నిజమే..



సెస్ వసూళ్ల పేరుతో రసీదు అందజేసే ప్రక్రియలో అవకతవకలు జరిగింది నిజమే. కొంత మొత్తం నగదు స్వాహా చేసినట్టు మేం గుర్తించాం. వారి వద్ద నుంచి రూ.800 మాత్రమే తిరిగి మార్కెటింగ్ శాఖకు కట్టించాం. అవకతవకలు జరిగినట్టు కొన్ని రసీదులు గుర్తించాం. భారీగా నిధులు స్వాహా చేసినట్టు ఆధారాలు ఎక్కడా లభ్యం కాలేదు. మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

– అనితాకుమారి, మార్కెటింగ్ శాఖ ఏడీ, నెల్లూరు.

నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

జిల్లాలోని వివిధ ఆలయాల్లో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు మొదలయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయం నుంచి స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు కలశాలతో భక్తులు ఊరేగింపు చేశారు. రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అనేకమంది భవానీ మాల వేసుకున్నారు. ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పోటెత్తారు. – సాక్షి నెట్‌వర్క్


సీతారామపురం: సిద్ధేశ్వరీదేవి అలంకారంలో ఇష్టకామేశ్వరి


నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయంలో చండీ అలంకరణలో అమ్మవారు


ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరి అలంకారం


నెల్లూరు రూరల్ నరసింహకొండపై ఆదిలక్ష్మిగా..


నవాబుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో స్కంధ మాత అలంకారంలో..


రంగనాయకులపేట నుంచి స్టోన్‌హౌస్‌పేట కన్యకా పరమేశ్వరి ఆలయానికి కలశాలతో భక్తుల ఊరేగింపు


నెల్లూరు రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉత్సవాల సందర్భంగా కలశాన్ని తీసుకొస్తూ..


మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీభవానీ అలంకారంలో..


జొన్నవాడలో కామాక్షితాయి ఉత్సవాల సందర్భంగా కలశ స్థాపన కోసం పెన్నానది నుంచి జలాలు తీసుకొస్తున్న వేదపండితులు తదితరులు

క్లుప్తంగా

నేటి నుంచి వీఎస్‌యూలో స్పాట్ అడ్మిషన్స్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో ఐ సెట్ రాసిన వారికి స్పాట్ అడ్మిషన్స్‌కు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ హనుమారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్స్‌లో సీటు పొందేందుకు ఐ సెట్–2024లో క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. ఈనెల 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

కోవూరుపల్లి వద్ద రోడ్డు ప్రమాదం

బిట్రగుంట: బోగోలు మండలం కోవూరుపల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కారు నెల్లూరు నుంచి కావలికి వెళ్తోంది. ఇది కోవూరుపల్లి సమీపంలోకి వచ్చేసరికి హఠాత్తుగా రోడ్డుపైకి వచ్చిన మేకను, దానిని తీసుకెళ్లేందుకు వచ్చిన యజమానికి ఢీకొట్టింది. డ్రైవర్ అప్రమత్తమై కారును ఒక్కసారిగా పక్కకు తిప్పడంతో ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న ఆటోను కూడా ఢీకొంది. ఈ ప్రమాదంలో మేక యజమానితోపాటు కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న బిట్రగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోల్డ్ స్కీమ్ పేరిట మోసం

• బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): గోల్డ్ స్కీమ్ పేరుతో మోసగించిన ఓ వ్యక్తిపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. రామ్మూర్తి నగర్‌లో రిషిత కుటుంబం నివాసం ఉంటోంది. ఆమెకు కాపువీధిలోని ఓ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో పనిచేస్తున్న మహిళ స్నేహితురాలు. ఆమె ద్వారా రిషితకు బంగారు వ్యాపారి వెంకట సునీల్‌కుమార్ పరిచయమయ్యాడు. ఆయన తాను గోల్డ్‌స్కీమ్ నిర్వహిస్తున్నానని నెలకు రూ.5 వేల చొప్పున 11 నెలలు కడితే 12వ నెలలో రూ.5 వేలు బోనస్ కలిపి బంగారు ఆభరణం ఇస్తానని నమ్మబలికాడు. దీంతో రిషితతోపాటు ఆమెకు తెలిసిన పలువురు స్కీమ్‌లో చేరి నగదు కట్టారు. కాలపరిమితి ముగిసినా సునీల్ బంగారు ఆభరణాలు ఇవ్వలేదు. బాధితులు నిలదీయడంతో చెల్లని చెక్కులు ఇచ్చాడు. ఇటీవల ప్రశ్నించగా అసభ్యకర పదజాలంతో దూషించడమే కాకుండా దౌర్జన్యం చేశాడు. ఈ మేరకు బాధితులు బుధవారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

ఇసుక సిద్ధంగా ఉంది

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ప్రజల అవసరాలకు సరిపడా ఇసుక సిద్ధంగా ఉందని, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుకింగ్స్ పెరిగే కొద్దీ ఇసుక నిల్వలు కూడా పెంచేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. త్వరలోనే ఓపెన్ రీచ్‌లు కూడా అందుబాటులోకి వస్తాయని, తద్వారా మరింత ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్ బుకింగ్ విధానంలో టెక్నికల్‌గా ఇబ్బందులు లేకుండా వెంటనే పరిష్కరించాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, మైనింగ్ డీడీ చంద్రశేఖర్, సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజు, ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

చెలరేగుతున్న కేటుగాళ్లు

హలో మేం ఏసీబీ నుంచి మాట్లాడుతున్నాం.. మీరు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని ఫిర్యాదులు అందాయి. మీపై కేసు నమోదు చేయకూడదంటే అడిగినంత నగదు ఇవ్వాలంటూ డిమాండ్ చేసి అందినకాడికి దోచేస్తున్నారు దుండగులు. కొందరు బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్తుంటే మరికొంత మంది మాత్రం పరువుపోతుందనే భయంతో మిన్నకుండిపోతున్నారు.



- ఏసీబీ అధికారుల పేరుతో హల్‌చల్
- ప్రభుత్వ అధికారులకు ఫోన్ చేసి బెదిరింపులు
- అందినకాడికి దోచేస్తున్న నిందితులు
- ఇటీవల చేజర్ల తహసీల్దార్ నుంచి నగదు వసూలు

నెల్లూరు(క్రైమ్): అడ్డదారిలో డబ్బు సంపాదించాలని కొందరు వ్యక్తులు ఏసీబీ అధికారుల అవతారమెత్తారు. ప్రభుత్వ వెబ్‌సైట్ల నుంచి రిజిస్ట్రేషన్స్, ఎక్సైజ్, రెవెన్యూ, పోలీసు, ఆర్టీఓ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, కమర్షియల్ టాక్స్, దేవదాయ తదితర శాఖలకు చెందిన అధికారుల ఫోన్ నంబర్లను సేకరించి మోసాలకు పాల్పడుతున్నారు. ఏసీబీ హెడ్ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ప్రభుత్వ ఉద్యోగికి ఫోన్ చేసి మాటలు కలుపుతారు. మీపై అవినీతి ఆరోపణలున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఫిర్యాదులు అందాయి. సెటిల్ చేసుకుంటే ఓకే లేదంటే రైడ్ జరుగుతుందని భయపెడతారు. కావాలంటే తమ డీఎస్పీతో మాట్లాడాలంటూ మరో వ్యక్తికి ఫోన్ ఇచ్చి బెదిరిస్తున్నారు. భయపడిపోయే ఉద్యోగుల నుంచి గూగుల్‌పే, ఫోన్‌పే, ఇతర యాప్స్ ద్వారా రూ.లక్షల్లో నగదు వసూలు చేస్తున్నారు. నకిలీ ఏసీబీ అధికారులు జిల్లాలోని వివిధ శాఖల అధికారులను బెదిరించి రూ.లక్షలు దోచేశారు. ఈ తరహా నేరాలు తరచూ జరుగుతున్నా బాధిత అధికారుల్లో అధిక శాతం మంది పరువుపోతుందనో? ఇతరత్రా కారణాలతో ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీనిని అలుసుగా తీసుకున్న సదరు నకిలీలు చెలరేగిపోతున్నారు.

వీరి పనేనా?

రాష్ట్రంలో అనంతపురం జిల్లాకు చెందిన ఓ గ్యాంగ్ ఈ తరహా నేరాలకు పాల్పడడంలో సిద్ధహస్తులని పేరుంది. సదరు గ్యాంగ్ లీడర్ అతని స్నేహితులు ఓ సినిమాతో ప్రభావితమై అడ్డదారుల్లో డబ్బు సంపాదించేందుకు నకిలీ ఏసీబీ అధికారుల అవతారమెత్తారు. దొడ్డిదారిన ప్రీ పెయిడ్ సిమ్ కార్డులు సంపాదించి వాటిని వినియోగించి మోసాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వీరిపై కేసులున్నాయి. తాజాగా చేజర్ల తహసీల్దార్‌ను బెదిరించింది వీరేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తస్మాత్ జాగ్రత్త

ఈ తరహా మోసాలపై ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. ఏసీబీ అధికారులు ఫోన్ చేసి నగదు డిమాండ్ చేయరన్న విషయాన్ని ఉద్యోగులు గుర్తించాలి. డబ్బు కోసం బెదిరింపు చర్యలకు పాల్పడితే వారు నకిలీ అధికారులని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటారు.

జిల్లాలో కొన్ని ఘటనలు

- ఏసీబీ అధికారినంటూ 2020లో ఆర్టీఓ కార్యాలయంలో పనిచేసిన ఓ ఉద్యోగికి ఫోన్ కాల్ వచ్చింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నావని ఫిర్యాదులు అందాయని, అడిగినంత డబ్బు ఇస్తే రైడ్ ఉండదని చెప్పడంతో బెంబేలెత్తిన సదరు ఉద్యోగి రూ.లక్షల్లో ముట్టజెప్పాడు.
- ఏసీబీ హెడ్ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నామని, మీపై అవినీతి ఆరోపణలకు సంబంధించి ఫిర్యాదులు అందాయని కేసు నమోదు చేయకుండా ఉండాలంటే నగదు ఇవ్వాలని రిజిస్ట్రేషన్ శాఖలో గతంలో ఓ ఉద్యోగిని బెదిరించి రూ.లక్షలు కాజేశారు.
- నెల్లూరులోని ఓ దేవస్థానం ఈఓకు ఫోన్ కాల్ వచ్చింది. మీపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. సెటిల్ చేసుకుంటే సరే లేదంటే రైడ్ జరుగుతుందని బెదిరించారు. రూ.1.50 లక్షలు డిమాండ్ చేయడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- తాజాగా చేజర్ల తహసీల్దార్‌కు ఫోన్ చేసి అవినీతిపై ఫిర్యాదులు అందాయని అడిగినంత ఇస్తే రైడ్ ఉండదని నగదు దోచేశారు. దీంతో సదరు అధికారి నేరగాళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.



స్వగ్రామానికి వెళ్తుండగా..

• రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని బొమ్మరాజుచెరువు గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి గ్రామానికి చెందిన కె.రామసుబ్బారెడ్డి (33), శ్రీకాంత్‌రెడ్డిలు కారులో కడప నుంచి కావలికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో బొమ్మరాజుచెరువు గ్రామ సమీపానికి రాగా కుక్క అడ్డు వచ్చింది. దానిని తప్పించబోయి కారు అదుపుతప్పి పక్కనే ఉన్న కంకర గుట్టపైకి దూసుకెళ్లి తిరగబడింది. ఈ ఘటనలో ఎయిర్ బ్యాగ్ తెరుచుకున్నా ముందు అద్దం పగిలిపోవడంతో రామసుబ్బారెడ్డి నేలపై పడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కారు నడుపుతున్న శ్రీకాంత్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని అతడిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఎస్సై వీరప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రామసుబ్బారెడ్డి మృతదేహం

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	123
లేయర్ (లైవ్) :	110
బ్రాయిలర్ చికెన్ :	222
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	248
లేయర్ చికెన్ :	187

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి :	రూ.90
సన్నవి :	రూ.45
పండ్లు :	రూ.35



విజన్ డాక్యుమెంట్ తయారీకి చర్యలు

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో జిల్లాలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సూచనలు, సలహాలు తీసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సూచనలు, సలహాలు పొందుపరచాలని కోరారు. ఇప్పటి వరకు 50 వేల మంది స్పందించారన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు ద్వారానే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి వీలవుతుందని చెప్పారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, డీఈఓ రామారావు, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, వ్యవసాయాధికారిణి సత్యవాణి, ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, పర్యాటక శాఖ ఆర్డీ రమణ, కుట్టి కళాశాల ప్రతినిధి లతీఫ్ కుట్టి మాట్లాడారు. ఆడిటర్ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ సి.విజయ, లక్ష్మీనారాయణ, శ్రీలత, ఖాసీం, రాధ, కృష్ణారెడ్డి తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మేయర్ పొట్లూరి స్రవంతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో ప్రజాప్రతినిధులు

తెలుగు తమ్ముడా.. మజాకా

- రోడ్డుపై ఎంపీ వేమిరెడ్డి అనుచరుడి బర్త్‌డే వేడుకలు
- వాహనాలు ఆపేసి డీజే సాంగ్స్‌తో అరుపులు
- తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు

నెల్లూరు సిటీ: అధికారం చేతిలో ఉందని తెలుగు తమ్ముళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నిబంధనలను పట్టించుకోకుండా రోడ్లపై బర్త్‌డే వేడుకలు జరుపుకోవడం ఇటీవల టీడీపీ నాయకులకు సర్వసాధారణమైంది. తమ అనుచరులు, కార్యకర్తలతో ఆయా ప్రాంతాల్లో వీరంగం సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని నెల్లూరు హబ్ యజమాని అరవింద్ ఉన్నాడు. అతను తన పుట్టినరోజు వేడుకలను గురువారం రాత్రి హబ్ వద్ద రోడ్డుపై చేసుకున్నాడు. అటువైపు రోడ్లను అరవింద్ అనుచరులు వాహనాలతో మూసివేశారు. రహదారిపైనే డీజే బాక్సులు పెట్టారు. పాటలకు డాన్సులు వేస్తూ టీడీపీ కార్యకర్తలు నానా హంగామా సృష్టించారు.

అపార్ట్‌మెంట్ వాసుల ఆగ్రహం

హబ్‌కు సమీపంలో అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటిలో అనేకమంది వ్యాపారస్తులు, ఉద్యోగులు నివాసం ఉంటున్నారు. డీజే, తెలుగు తమ్ముళ్ల కేకలతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అధికారం ఉందని ఇష్టారీతిగా వ్యవహరించడంపై పలువురు మండిపడ్డారు.


రోడ్డుపై ఎంపీ వేమిరెడ్డి అనుచరుడు, తెలుగు తమ్ముళ్ల వీరంగం